పల్లా సింహాచలంకు

## ఎమ్మెల్యే విజయ్‌చంద్ర ఘన నివాళులు

**విశాలాంధ్ర-పార్వతీపురం:** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తండ్రి స్వర్గీయ సింహాచలంకు ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర నివాళులర్పించారు. ఇటీవల సింహాచలం స్వర్గస్తులైన సంగతి తెలిసిందే. ఆదివారం విశాఖపట్నంలో సింహాచలం సంతాపసభను నిర్వహించగా రాష్ట్రవ్యాప్తంగా టిడిపి ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్యనాయకులు అందరూ పాల్గొని సింహాచలంకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయ్‌చంద్ర మాట్లాడుతూ నేటితరం రాజకీయ నాయకులకు పల్లా సింహాచలం స్ఫూర్తిదాయకమని, విశాఖ జిల్లాలో సుదీర్ఘ రాజకీయ నడిపిన ఆయనను ఈప్రాంత ప్రజలు ఎంతో గౌరవించే వారని తెలిపారు. తండ్రి అడుగుజాడల్లోనే నడుస్తున్న టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పళ్ళ శ్రీనివాసరావు రాష్ట్రంలోని అత్యధిక మెజారిటీ సాధించి తిరుగులేని నాయకుడిగా కొనసాగుతున్నారన్నారు ఎవరికి ఏకష్టం వచ్చినా తాను ఉన్నానంటూ భరోసా కల్పించే పల్లా శ్రీనివాసరావును గాజువాక ప్రజలు గుండెల్లో పెట్టుకొని చూసుకుంటున్నారని ఆయన సేవా తత్పరతకు ఇదేనిదర్శనమని కొనియాడారు.

## క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలలో విజేత గా వెంకంపేట

**విశాలాంధ్ర-సీతంపేట:** మండలం, దేవానపురంలో నెల రోజులు పైగా జరిగిన 4వ ప్రీమియం క్రికెట్ లీగ్ లో 97 టీంలు పాల్గొన్నాయి. ఇందులో విజేతగా పాలకొండ మండలం, వెంకంపేట టీమ్ విజేత గా గెలుపొందారు. కిల్లాడ రెండవ స్థానం సాధించింది. మాన్ అఫ్ ది మ్యాచ్ గా చందు వెంకంపేట .మేన్ అఫ్ ది సిరీస్ గా చంద్రహాస్ కిల్లాడ సాధించారు. ప్రథమ స్థానం ద్వితీయ స్థానం సాధించిన వారికి సీతంపేట సబ్ ఇన్స్పెక్టర్ అమ్మన్నరావు చేతులమీదుగా బహుమతిలు ప్రధానం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు ఎమ్.సూరిబాబు.బి. జగన్నాయకులు, కే.కామయ్య.వి. మురళి ,మూటక.రవికుమార్.ఎమ్. శ్యామ్, సుందర్రావు, పాలక పురుషోత్తం,తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ పుట్టినరోజు వేడుకలు నిర్వహణ

**విశాలాంధ్ర-బెలగాం:** మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. కర్షక మహర్షి హాస్పిటల్ దగ్గర ఆయన స్వగృహంలో జన్మదిన సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛంలు, బోకేలు అందజేసి పలువురుశుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ సందర్భంగా కేకును కట్‌చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనసోదరుడు డాక్టరు రామ్మోహనరావు, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, టిడిపి నాయకులు చుక్క జయప్రకాష్, కోలా బాబు, కొల్లి తిరుపతిరావు, దొగ్గ మోహనరావు, మరిశర్ల కార్తీక్ నాయుడు, బొత్స వెంకట నాయుడు, రామ్మూర్తినాయుడు, రెడ్డి భీమశంకరరావు, లయన్స్ క్లబ్ సభ్యులు, పలువురు పట్టణ ప్రముఖులు, కుటుంబ సభ్యులు, పలువురు వైద్యులు, అభిమానులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## రేగుల గూడ అటవీ ప్రాంతంలో ఏనుగుల సంచారం

**విశాలాంధ్ర-సీతంపేట:** మండలం పులిపుట్టి పంచాయతీ, రేగుల గూడ అటవీ ప్రాంతంలో ఏనుగులు గుంపు సంచారం చేస్తుందని అటవీశాఖ బీట్ అధికారి దాలినాయుడు ఆదివారం తెలిపారు. గత నాలుగు రోజులుగా ఏనుగులు గుంపు రేగులగూడ కొండల్లో సంచరిస్తు ఘీంకారాలు వస్తున్నాయి. అందువలన ఆ ప్రాంతాల్లో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అటవీ ప్రాంతంలో పనులపై వెళ్లేవారు తగు జాగ్రత్తలు వహించాలని ఏనుగులను కవ్వించవద్దు అని తెలిపారు.

శ్రీకాకుళం ఐఐఐటి పరిపాలన అధికారి

## ముని రామకృష్ణకు డాక్టరేట్

**విశాలాంధ్ర-పార్వతీపురం:** మన్యం జిల్లాలోని సీతానగరం మండలంలో జోగింపేట గ్రామానికి చెందిన ముని రామకృష్ణ ఐఐటీ తిరుపతిలో పిహెచ్‌డీ అవార్డును సొంతం చేసుకున్నారు. శ్రీకాకుళం జిల్లా ఐఐఐటిలో డాక్టర్ ముని రామకృష్ణ పరిపాలన అధికారిగా పనిచేస్తున్నారు. సాధారణ కుటుంబ నేపథ్యంనుండి వచ్చిన రామకృష్ణ ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని, ఐఐటీ ఖరగ్‌పూర్ లో ఉన్నత విద్యను అభ్యసించారు. ఉన్నత విద్య అనంతరం ట్రిపుల్ ఐటి ఆర్ కే వాలీలో,నూజివిడ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలు అందించి, ఇప్పుడు శ్రీకాకుళంజిల్లాలోని ట్రిపుల్ ఐటిలో పరిపాలన అధికారిగా పనిచేస్తున్నారు. గ్రామీణ ప్రాంతమును నుండి విచ్చేసిన రామకృష్ణ వందల మంది విద్యార్థులను వారిలక్ష్యాలను చేరుకోవడంలో సహాయపడిన వ్యక్తని ఈ ప్రాంతంలో మంచి పేరు ఉంది. అనేక మంది యువతకు, పిల్లలకు ప్రేరణగా నిలుస్తున్నారు. ఆయనకు పి హెచ్ డీ రావడం పట్ల పార్వతీపురం మన్యం జిల్లాలోని ఆయన స్వగ్రామంలో అందరూ అభినందనలు తెలిపారు.గ్రామానికి చెందిన బొమ్మినాయిని లక్ష్మణరావు మాట్లాడుతూ తన ఇద్దరు పిల్లలు ఉన్నత చదువులు చదవడానికి ముని రామకృష్ణ కారణమని తెలిపారు. ఎంతోమందికి ఆయన ఆదర్శంగా ఉంటారని తెలిపారు.

## మన్యంలో 600 లీటర్లు బెల్లం ఊటలు ధ్వంసం

**విశాలాంధ్ర-సీతంపేట:** మండలం మల్లెమ్మ కొండల్లో ఆదివారం సబ్ ఇన్స్పెక్టర్ అమ్మానరావు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చెయ్యగ నాటు సారా తయారీ కోసం బెల్లం ఊటలు సిద్ధం చెయ్యగ పోలీసులు 600 లీటర్లు బెల్లం ఊటలు ధ్వంసం చేశారు. ఏజెన్సీలో నాటు సారా తయారుచేసిన, అమ్మకాలు జరిపిన క్రిమినల్ కేసులు నమోదు చెయ్యటం జరుగుతుంది అని తెలిపారు.

## తెగుళ్ల నిర్ధారణ చేసుకుని మాత్రమే మందులు వాడాలి

**విశాలాంధ్ర-పాచిపెంట :** రైతులు పంటలకు ఆశించిన వ్యాధుల నిర్ధారణ చేసుకున్న పిదప మాత్రమే సరియైన మందులను పిచికారీ చేసుకోవాలని వ్యవసాయ అధికారి కే తిరుపతిరావు అన్నారు. మండలంలో గల పాంచాలి గ్రామంలో 32 రకాల 25 కిలోల నవధాన్యాల అనంతరం వరి సాగు ప్రయోగం రైతు కొల్లా సత్యనారాయణ రాజు పొలంలో చేసిన అనంతరం పత్తి మరియు మొక్కజొన్న పంటలను ఆయన ఆదివారం పరిశీలించారు. ప్రస్తుతం పత్తి పంటకు ఎలాంటి తెగుళ్ల లేవని మబ్బు వాతావరణంలో రసం పీల్చు పురుగులు ఆశించే అవకాశం ఉన్నందున రైతులు ముందుగా పొటాష్ ఎరువులు వేసుకోవాలని పంటలను ఆశించే పురుగుల మరియు తెగుళ్ళ ను సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా నిర్ధారించుకొని తదుపరి మాత్రమే తెగుళ్ళ మందుల పిచికారికి వెళ్లాలని సూచించారు మొక్కజొన్న పంటలో ప్రస్తుతం కత్తెర పురుగు ఆశించిందని దీని నివారణకు నేరుగా ఖరీదైన రసాయన పురుగు మందులను వాడకుండా వేప మందు వేప కషాయం నీమాస్త్రం వంటి మందులతో లేదా క్లోరిపైరిఫాస్ వంటి తక్కువ ఖర్చుతో కూడుకున్న ప్రభావవంతంగా పనిచేసే మందులను మాత్రమే పిచికారి చేసుకోవాలని అన్నారు .విచక్షణారహితంగా పురుగుమ0దులను వాడితే పురుగులు తెగుళ్లు తగ్గకపోవడమే కాకుండా పర్యావరణానికి నష్టం కలిగి జీవ వైవిధ్యం నశించి కొత్త రకాలైన పురుగులు తెగులు ఆశించే ప్రమాదం ఉందని అన్నారు. కాబట్టి తప్పనిసరిగా రైతులు పురుగుమందులను వాడినప్పుడు వ్యవసాయ శాఖ సహాయకులు సలహాలు సూచనలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఈదుబిల్లి శ్రీను మరియు ఎల్ వన్ తిరుపతి నాయుడు పాల్గొన్నారు. ..

## నేటి యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

**విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్:** ఈ నెల 23న సోమవారం తలపెట్టనున్న యువత పోరు నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ శాసనసభ్యులు అలజంగి జోగారావు అన్నారు. రాష్ట్ర వైయస్ఆర్ సీపీ అధినేత శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు విద్యార్థి, యువజన విభాగం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో యువత పోరు భారీ నిరసన కార్యక్రమం సోమవారం చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గత ఎన్నికల్లో నిరుద్యోగులు, విద్యార్థులకి అనేక హామీలిచ్చి, గెలిచాక వెన్నుపోటు పొడిచిన నారా చంద్రబాబు నాయుడు ఏడాది కాలంగా విద్యార్థులకి ఫీజు రీయింబర్స్ మెంట్ చెల్లించకుండా నాటకాలు ఆడుతున్న వైనం, నిరుద్యోగులకి 20లక్షల ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి ఉద్యోగాలు ఇవ్వలేదు సరికదా ఉన్న ఉద్యోగాలు ఊడపేకేస్తూ నిరుద్యోగులను నిలువునా ముంచేస్తూ, మరోవైపు అధికారంలోకి వాస్తే నెలకు 3,000 నిరుద్యోగ భృతి ఇస్తామని నమ్మించి ఇవ్వకుండా ఎగనామం పెట్టడమే ఈ కూటమి ప్రభు త్వం గత ఏడాది కాలంగా విద్యార్థులను, యువతను మోసం చేస్తున్న వైనాన్ని నిలదీస్తూ తక్షణమే కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయాలని కోరుతూ వైయస్ఆర్ సీపీ యూత్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుం దన్నారు. కావున కార్యక్రమంలో యువత అంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జోగింపేట నుంచి మొదటిసారి డాక్టరేట్ అవార్డు అందుకున్న

## ముని రామకృష్ణకు అభినందనల వెల్లువ

**విశాలాంధ్ర-సీతానగరం:** మండలంలోని జోగంపేట గ్రామానికి చెందిన ముని రామకృష్ణ ఐఐటీ తిరుపతి విశ్వవిద్యాలయంలో శనివారం నాడు పిహెచ్‌డీ పొందటంతో గ్రామంలో అన్ని వర్గాలవారు ఆయనను అభినందించారు. తమ గ్రామంలో మొదటి పి హెచ్ డీ సాధించిన వ్యక్తిగా డాక్టర్ ముని రామకృష్ణని వారంతా తెలిపారు.విద్య జీవితాలను మార్చగలదని నిరూపించడంలో రామకృష్ణ నిదర్శనమని, తమ గ్రామంలోని చదువుకున్నవారికి ఆయన ఆదర్శమని పలువురు వారిమాటల్లో తెలిపారు. సాధారణ వ్యవసాయ కుటుంబానికి చెందిన రామకృష్ణ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటూ, ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ఉన్నతవిద్యను అభ్యసించే స్థాయికి చేరుకున్నారు .ఉన్నత విద్యాభ్యాసం పూర్తయ్యాక ఆర్ కే వాలీలో ట్రిబుల్ ఐటీలో, నూజివిడ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలు అందించి, ప్రస్తుతం ట్రిపుల్ ఐటి శ్రీకాకుళంజిల్లాలో పరిపాలనాధికారిగా పనిచేస్తున్నారు. రామకృష్ణ తన ప్రయాణంలో వందలమంది విద్యార్థులను వారి లక్ష్యాలను చేరుకోవడంలో సహాయపడటం, వారిని ప్రేరేపించి మార్పు తెచ్చిన వ్యక్తిగా నిలిచారు. రామకృష్ణ అనేక మంది యువతకు, గ్రామంలోనే గాక మండలములో ప్రేరణగా నిలిచారని గ్రామస్తులు తెలిపారు.గ్రామానికి చెందిన పలువురు నాయకులతోపాటు తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జ్ బొమ్మినాయిని లక్ష్మణరావు, టంకల శ్రీనివాసరావులు డాక్టర్ మునిరామ కృష్ణను డాక్టరేట్ అవార్డ్ సాధించిన సందర్భంగా ఫోన్లో అభినందించారు. తన పిల్లలు పిల్లలు ప్రశాంత్, మనోహర్లురామకృష్ణ ఉన్నత విద్యాభ్యాసం, ఉన్నత స్థాయిలో ఉండటాన్ని చూసి ఇన్స్పైర్ అయ్యారని, ఆయన సలహాలు, సూచనలతో ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని లక్ష్మణరావు తెలిపారు. లక్ష్మణ రావు పిహెచ్ డీను తీసుకున్నసందర్భంగా జోగంపేట గ్రామస్తులతో పాటు సీతానగరం మండలంలోని పలువురు అభినందన తెలిపారు.

ప్రభుత్వ ఐటిఐ లలో సీట్ల భర్తీకై

## ఆన్‌లైన్లో దరఖాస్తుల ఆహ్వానం

–చింతపల్లి/అప్పర్ సీలేరు ఐటిఐ లో మిగులు సీట్ల భర్తీ కై దరఖాస్తుల ఆహ్వానం - ఐటిఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసాచారి

**విశాలాంధ్ర-చింతపల్లి :** చింతపల్లి/అప్పర్ సీలేరు ప్రభుత్వ ఐటిఐ లలో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కై 2వ విడత ప్రవేశం కొరకు ఆన్లైన్లో దరఖాస్తులను ఆహ్వానిస్తునట్లు ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసాచారి ఒక ప్రకటనలో తెలిపారు. అల్లూరి జిల్లా చింతపల్లి దరి పెంటపాడు/అప్పర్ సీలేరు ప్రభుత్వ ఐటిఐలలో 2025- 2026, అదే విధంగా 2025 - 2027 విద్యా సంవత్సరాలకు సంబంధించి వివిధ ట్రేడ్ లలో మిగిలి ఉన్న సీట్లను, భర్తీకి గాను, 2వ విడత ప్రవేశం కొరకు ఆన్లైన్లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు www.iti.ap.gov. in అనే వెబ్సైట్ నందు తమ దరఖాస్తు లను జూలై 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ మేరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు దగ్గర లోని, ఏదైనా ప్రభు త్వ ఐటిఐ నందు,తమ ఒరిజినల్ ధ్రువపత్రాలను (సర్టిఫికెట్స్) జూలై 17వ తేదీ లోగా వెరిఫికేషన్ చేయించుకోవాలని ఆయన సూచించారు. దరఖాస్తు చేసుకుని, వెరిఫికేషన్ పూర్తి చేసుకున్న అభ్యర్థులు జూలై 21వ తేదీ, ఉదయం 10 గంటలకు చింతపల్లి ప్రభుత్వ ఐ టి ఐ. నందు ఒరిజినల్ ధ్రువపత్రాలతో కౌన్సిలింగ్ నకు హాజరుకావలసి ఉందని ప్రిన్సిపాల్ శ్రీనివాసాచారి తెలియజేశారు. పూర్తి వివరాల (సమాచారం) కొరకు ప్రభుత్వ ఐటిఐ, చింతపల్లి నందు సంప్రదించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

## ప్రజల పక్షాన పోరాడే పత్రిక విశాలాంధ్ర

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.సింహాచలం

**విశాలాంధ్ర-దుంబ్రిగుడ:** నిరంతరం ప్రజల పక్షాన పోరాడే పత్రిక విశాలాంధ్ర తెలుగు దినపత్రిక అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె. సింహాచలం అన్నారు. మండల కేంద్రంలోని ఆదివారం శెట్టి. మల్లేశ్వరరావు విశాలాంధ్ర పత్రిక విలేఖరి, సిపిఐ అల్లూరి జిల్లా కార్యవర్గ సభ్యులు కె. సింహాచలం ఆధ్వర్యంలో 73వ విశాలాంధ్ర వార్షికోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడు దశాబ్దాలుగా ప్రజల పక్షాన పోరాడి ప్రజా సమస్యలపై నిరంతరం కృషి చేస్తూ ప్రజలకు న్యాయం చేయగలిగిన ఏకైక తెలుగు దినపత్రిక విశాలాంధ్ర పత్రిక అని చెప్పారు. 19 52వ సంవత్సరం నుంచి విశాలాంధ్ర తెలుగు దినపత్రిక స్థాపితమై అప్పటి నుంచి ఇప్పటివరకు వెనకడుగు వేయకుండా ఎలాంటి సమస్యలైనా వెలుగులో తెచ్చి ఇటు ప్రజలకు అటు ప్రభుత్వానికి వారిదిగా ఉంటూ సమస్యలు పరిష్కరిస్తూ ముందుకు దూసుకుపోతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, హుకుంపేట విశాలాంధ్ర తెలుగు దినపత్రిక విలేఖరి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## గంగవరంలో సీపీఐ మండల మహాసభ

**విశాలాంధ్ర-సీలేరు:** జీకేవీధి మండలం దారకొండ పంచాయతీ గంగవరం గ్రామంలో సిపిఐ మండల మహాసభ జరిగింది. ఇందులో నూతన మండల కార్యదర్శి కవర్ల భగవాన్, సహాయ కార్యదర్శి కొర్ర దాసరాధను ఎన్నుకోవడం జరిగింది. ఈ మండల మహాసభలో అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకరి విష్ణుమూర్తి హాజరై మాట్లాడారు. రానున్న రోజుల్లో సమస్యలపై పోరాటాలు చేయాల్సిన అవశ్యకత ఉందన్నారు. ప్రజల పక్షాన సిపిఐ పార్టీ ఎప్పుడు ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు మండల నాయకులు ఇరువాడ దేముడు, గోవింద్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రామారావు, దారకొండ పంచాయతీ ఉప సర్పంచ్ నారాయణ, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధిత కుటుంబాల కు 20,000 వితరణ

**విశాలాంధ్ర-వి.ఆర్.పురం:** అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలో ఇటీవల సీతంపేట గ్రామానికి చెందిన ముత్యాల రమేష్, ముత్యాల సుందర రాములు అను వారి ఇండ్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదానికి గురై రెండిల్లు కాలి బూడిద అయిన సంఘటన పాఠకులకు విధితమే, అగ్ని ప్రమాద బాధిత కుటుంబాల వారికి ఆదివారం వడ్డీ సంఘం యువత తరుపున 20000 రూపాయలు వితరణగా ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమం లో బొర్రా నరసింహ రావు, సిద్దు, నరేష్, శేఖర్, శ్రీధర్, రాజు, ప్రవీణ్, రాంబాబు, వాసు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కృష్ణకుమారి జన్మదిన వేడుకలు

నిరుపేదలకు నిత్యవసర సరుకులు, పళ్ళు పంపిణీ

**విశాలాంధ్ర-దుంబ్రిగుడ:** మండలంలోని మానవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కృష్ణకుమారి జన్మదిన వేడుకలు సందర్భంగా కేక్ కట్ చేసి ఒకరికొకరు నోరు తీపి చేసుకున్నారు. ఈ సందర్భంగా నిరుపేద కుటుంబాలకు భోజనాలతో పెట్టి, అరకులోయ పీహెచ్సీలో ఉన్న జ్వర బాధితులకు కళ్ళు పదార్థాలు, రొట్టెలు పాలు ఆమె పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడమే నా లక్ష్యమని చెప్పారు. సాటి మనుషులు ఇబ్బందులు పడుతున్నప్పుడు మానవత్వంతో ఎంతో కొంత ఆర్థిక సహాయం అందించిన వారే గొప్పవారని చెప్పారు. ఆస్తి అంతస్తులు లేకపోయినా ఇతరులకు మానవత్వంతో సేవా అందించడమే నా కర్తవ్యం అని చెప్పారు. ప్రస్తుతం ఉన్న సమాజంలో అనేకమంది నిరుపేద కుటుంబాలు పూటకు గడవని వారు కూడా ఉన్నారని, అటువంటి వారికి నేటి యువత వారి వారి స్తోమతబట్టి వారికి వచ్చే ఆదాయం బట్టి ఇతరులకు సహాయం అందిస్తే సమాజం మరింత మెరుగుపడుతుందని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు.

## ఘనంగా విశాలాంధ్ర వార్షికోత్సవం

**విశాలాంధ్ర-పాడేరు:** దినపత్రిక ఏర్పాటు చేసి 73 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా విశాలాంధ్ర 73వ వార్షికోత్సవం అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరులో ఆదివారం ఘనంగా నిర్వ హించారు. విశాలాంధ్ర పాడేరు ప్రతినిధులు కృష్ణ, సునీల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకి సీపీఐ నాయకులు అమర్, రాధాకృష్ణ, రాజుబాబు లు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్మికులతో పాటు, బలహీనవర్గాలకు పేదలకు అండగా నిలుస్తూ, ప్రజా సమస్యలను నిరంతరం వెలుగులోకి తెస్తున్న విశాలాంధ్ర దినపత్రిక మరిన్ని వార్షికోత్సవాలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటూ విశాలాంధ్ర చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పారిజాతం, రాజేష్, సురేంద్ర, రాజు, మాజీ ఎంపిటిసి వానుగు దేముడు, లక్ష్మీష్, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

### దుంబ్రిగుడ మండల కేంద్రంలో...

**విశాలాంధ్ర-దుంబ్రిగుడ :** మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో 73వ విశాలాంధ్ర వార్షికోత్సవం సందర్భంగా వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.

## పులి దాడిలో మృతిచెందిన పశువుల యజమానులకు పరిహారం చెల్లించాలి

**విశాలాంధ్ర-అనంతగిరి:** పెద్దపులి దాడిలో బలైన తమ మూగజీవులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ గిరిజనులు నాగళ్ళు భుజంపై పెట్టుకొని వినుత్న రీతిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. మండలంలోని నాన్ షెడ్యూల్ రొంపల్లి పంచాయతీ పరిధి కుండ శిఖరు గ్రామమైన బూరిగ .చిన్నకోనెల గ్రామాలకు చెందిన గిరిజన లబ్ధిదారులు ఆదివారం తమ వ్యవసాయ భూమి వద్ద వినుత్న రీతిలో కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వార్డు మెంబర్ సోమ్మెల .అప్పలరాజు మాట్లాడుతూ ఎత్తైన కొండ శిఖరాలు దట్టమైన అటవీ ప్రాంతలలో తమ నివాస గ్రామాలు ఉన్నాయని అయితే 2023 సంవత్సరంలో సోమ్మెల. పైడమ్మ .సోమ్మెల. చిన్న. గంగమ్మ. కోటపర్తి. గంగులు .కరాశి. లచ్చమ్మ. బూరిగ. గౌరమ్మ ఐదుగురు రైతులకు చెందిన మూడు ఆవులు. నాలుగు దుక్కటి ఎద్దులు పులి దాడికి గురైనట్లు ఫారెస్టు అధికారులకు పిర్యాదు చేయగా సంబంధిత పులి దాడులకు పాల్పడిన ఘటన స్థలాన్ని పరిశీలించి అనంతరం బెంగాల్ టైగర్ దాడికి పాల్పడినట్లు అధికారులు నిర్ధారించారు. అన్నారు. బుక్కటి ఎదులు లేక వ్యవసాయ పనులు చేయలేకపోతున్నామని . తమకు ఆర్థిక సహాయం అందించాలని కోరగా పశువు శాఖ వైద్యాధికారి పోస్టుమార్టం నివేదిక. అలాగే రైతులకు సంబంధించిన ఆధార్ బ్యాంక్ అకౌంట్ వంటి జెరాక్స్ కాపీలు ఫారెస్ట్ అధికారులు ఇవ్వాలని కోరావడంతో ఫారెస్ట్ అధికారులకు అయిదుగురు లబ్ధిదారుల కు సంబంధించినవి అందజేయడం జరిగిందని ఆయన తెలిపారు. అలాగే ఒక్క ఆవుకు 15000 చొప్పున మొత్తం 45 వేల రూపాయలు అలాగే దుక్కటి దూ ఒకదానికి 25 వేల రూపాయలు చొప్పున మొత్తం నాలుగు ఎద్దులకు లక్ష రూపాయలు చొప్పున పరిహారం చెల్లించేందుకు అధికారులు అంగీకరించారని అయితే నేటికీ మూడు సంవత్సరాలు గడిచిపోతున్న ఆ ఊసే లేదని ఇప్పటికైనా సరే ఫారెస్ట్ ఉన్న అధికారులు ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం నుండి తమకు వచ్చే ఆర్థిక సహాయాన్ని వెంటనే నెల రోజుల్లో చెల్లించాలని. లేకుంటే అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. దీనిపై పలుమార్లు అధికారులకు కలిసి విన్నవించిన పట్టించుకున్న నాథుడు కరువైరని ఆయన అన్నారు.

## యువతను మోసం చేసిన కూటమి సర్కార్...!

వైసిపి జిల్లా యువజన విభాగ అధ్యక్షులు నంగి రెడ్డి శరత్ బాబు

**విశాలాంధ్ర-కొమరాడ :** కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి అయిపోయినప్పటికీ చదువుతున్న యువతీ యువకులకు నేటి వరకు ఫీజు రీయింబర్సుమెంట్ చెల్లించకుండా విద్యార్థులను ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా యువతను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని వైసిపి జిల్లా యువజన విభాగ అధ్యక్షులు నంగి రెడ్డి శరత్ బాబు అన్నారు. రాజ్యలక్ష్మి పురం గ్రామంలో తన నివాసం వద్ద విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మోసానికి గురైన విద్యార్థులకు, యువతకు బాసటగా నిలిచే క్రమంలో పార్టీ అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు విద్యార్థి, యువజన విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నేడు ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమం అనంతరం మన్యం వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఓట్లు కోసం అధికారం కోసం ఆశపడి అమలు చేయలేని పథకాలను హామీ ఇచ్చి మోసం చేసి ప్రభుత్వం ఏర్పాటు చేసుకుందని అన్నారు. ఏడదైనా కనీసం ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా మండలాల్లో ఉన్న పరిష్కరించుకోలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని అన్నారు. రైతుల నుంచి ఉద్యోగుల వరకు అన్ని విభాగాలకు చెందిన వారిని కూటమి ప్రభుత్వం మోసం చేస్తూ కాలం గడుపుకుంటుంది తప్ప ఇచ్చిన హామీలను మాటను నిరబెట్టుకోకపోవడం చాలా దారుణం అని అన్నారు. కాబట్టి ప్రజలను అన్ని వర్గాలకు చెందిన వారిని మోసం చేసిన కుటమే ప్రభుత్వం వైఖరిని వ్యతిరేకిస్తూ ఈ నిరసన చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమాలకు అన్ని వర్గాలకు చెందిన వారు పార్టీ కార్యకర్తలు నాయకులు యువత అందరూ హాజరు ఆయన కోరారు.

## పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా దాలి నాయుడు

**విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్:** ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (పి.ఎ.ఎ.పి) పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులుగా వంగల దాలినాయుడు నియామకమయ్యారు. ఈ మేరకు ఆదివారం ఆ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శిఖరం నరహరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఈశ్వరయ్యలు ఆదివారం నియామక పత్రం అందజేసి పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులుగా నియమించినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లా లో గల విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగ విద్యాసంస్థల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై దృష్టి పెట్టి విద్యార్థుల సమస్యల పట్ల స్పందించాలని పిలుపునిచ్చారు. అలాగే జిల్లాలో విద్యార్థుల తల్లిదండ్రులతో కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. తల్లిదండ్రులతో లీగల్ సెల్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రైవేటు విద్యా సంస్థలు చేస్తున్న దోపిడీపై దృష్టి సారించాలన్నారు. విద్యార్థుల హక్కులకు భంగం కలగకుండా తగు తగువిధంగా పోరాటం చేయాలన్నారు. చట్టానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్న విద్యాసంస్థలపై న్యాయపరమైన పోరాటం చేయాలన్నారు. ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ నియమ నిబంధనలు అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా వంగల దాలినాయుడు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి, తనకు అప్పగించిన బాధ్యతలను శాయిశక్తులా నిర్వర్తిస్తానన్నారు. జిల్లాలో విద్యార్థుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

## ఆలోచన అద్భుతం. ఆచరణ వినూత్నం

- పశువుల మెడలో రేడియం స్టిక్కర్ల తో ప్రమాదాలకు చెక్
- ప్రమాదాల నివారణకు చేయూత -వారియర్స్ ట్రస్ట్

**విశాలాంధ్ర-చింతపల్లి :** రహదారులపై విచ్చలవిడిగా సంచరించే పశువుల కారణంగా సంభవించే ప్రమాదాల నియంత్రించేందుకు స్థానిక చేయూత వారియర్స్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు దూనబోయిన రమణ వినూత్న ఆలోచన చేశారు. ఆలోచన చేయడమే గాక తన మిత్రబృందంతో కలసి వెంటనే ఆచరించి చూపాడు. పశు పోషకుల నిర్లక్ష్య వైఖరి కారణంగా పూజించ బడవలసిన గోవులు యజమానులు ఆలనా పాలనా చూడకపోవడంతో రహదారులపై తిరుగుతూ గోడ పత్రికలు, కూరగాయలు, ఆకుకూరలు తింటూ రహదారుల పైనే సేదతీరుతున్న పరిస్థితి. దీంతో సాధారణ ప్రజలకే గాక, వాహన బోధకులకు తీవ్ర ఇబ్బందికరంగా తయారయ్యాయి. రహదారులపై సేద తీరుతున్న పశువులకు ఇటీవల అనేక ప్రమాదాలు చోటుచేసుకుని పలువురు వాహన చోదకులతో పాటు, పశువులు కూడా మృతి చెందిన సందర్భాలు లేకపోలేదు. ఈ పరిస్థితులను చూసి చలించిన చేయూత వారియర్స్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు (ఛైర్మన్) రమణ ఆ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఆలోచన చేశాడు. తనకు కలిగిన ఆలోచనను ట్రస్ట్ సభ్యులు, తోటి మిత్రులతో కలిసి ఆచరణలో పెట్టాడు. పత్రికా ప్రకటనల ద్వారా, పశుసంవర్ధక శాఖ, పంచాయతీ శాఖ ద్వారా పశువుల యజమానులకు ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చినా సమస్య పరిష్కారానికి సహకరించని కారణంగా పశువులు రహదారుల పైనే తిరుగుతుండడం వలన రాత్రివేళల్లో వాహనదారులు పశువుల కారణంగా ప్రమాదాలకు గురికాకుండా ఉండాలన్న సంకల్పంతో రహదారులపై సంచరించే పశువుల మెడలో రేడియం స్టిక్కర్లు వేయాలని చేసిన ఆలోచనను వెంటనే ఆచరణలో పెట్టి మూగజీవాల పట్ల తన ఉదార స్వభావాన్ని చాటుకున్నారు.

### వయసులో చిన్న... ఆలోచనలో మిన్న

వయసులో చిన్నవాడైనప్పటికీ ఆలోచనలో పెద్ద మనసు కలిగిన దూన బోయిన రమణ చేయూత వారియర్స్ ట్రస్ట్ ను ఏర్పాటు చేసి నిరుపేదలను ఆదుకోవడమే గాక, నిర్భాగ్యులకు తోసినంత ఆర్థిక సహాయం అందించి తన ఉదార స్వభావాన్ని చాటుకుంటున్నాడు. ఇప్పటికే ఎంతోమందికి చేయూతను అందించిన రమణ మరో అడుగు ముందుకేసి పశువుల వల్ల జరుగుతున్న ప్రమాదాల నివారణకు రేడియం స్టిక్కర్లతో పరిష్కార మార్గం చూపాడు. ఈ సందర్భంగా రమణ ఉదార స్వభావాన్ని పలువురు మెచ్చుకుని ఆయన ఆలోచన విధానాన్ని కొనియాడారు.

## పిఎన్‌పి ఆగ్రో ఫారెస్ట్రీ చేస్తున్న కృషి ప్రశంసనీయం

- ఉచిత సిల్వర్ ఓక్ మొక్కల రూపంలో రైతులకు బంగారు భవిష్యత్తు
- క్లస్టర్ సమన్వయకర్తలు సూరిబాబు, శంకర్

**విశాలాంధ్ర-చింతపల్లి:** వ్యవసాయంతో పాటు గిరి రైతులకు అదనపు ఆదాయాన్ని, భూమికి నవశక్తిని అందించాలనే విశాల దృక్పథంతో సిల్వర్ ఓక్ మొక్కలను ఉచితంగా పంపిణీ హర్షణీయమని క్లస్టర్ సమన్వయకర్తలు గోపి నాయక సూరిబాబు, శెట్టి శంకర్ అన్నారు. మండలంలోని కొత్తపాలెం పంచాయతీకి చెందిన కడశిల్ప, బురిసింగి, దేగలపాలెం, మామిడిపల్లి, మూలగొంది గ్రామాలకు పీ ఎన్ పీ ఆగ్రో ఫారెస్ట్రీ వారు ఉచితంగా రైతులకు సిల్వర్ ఓక్ మొక్కలు పంపిణీ చేశారు. పండుగ వాతావరణంలో జరిగిన ఈ పంపిణీ కార్యక్రమం అన్నదాతల ముఖాల్లో ఆనందం నింపింది. పీఎన్‌పీ ఆగ్రో ఫారెస్ట్రీ సంస్థ తీసుకున్న చరిత్రాత్మక నిర్ణయంతో రైతుల ముఖంలో నవ్వులు వెల్లి విరిసాయి. వ్యవసాయంతో పాటు రైతులకు అదనపు ఆదాయం, భూమికి నవశక్తిని అందించాలనే విశాల దృక్పథంతో, ఈ సంస్థ రైతులకు ఉచితంగా సిల్వర్ ఓక్ మొక్కలు పంపిణీ చేసి గిరిజనుల జీవితాల్లో సరికొత్త ఆశలు చిగురింప చేశారు. ఈ మహత్తర కార్యక్రమం కేవలం మొక్కల పంపిణీ మాత్రమే కాదని రైతుల భవిష్యత్తుకు వేసిన బలమైన పునాదన్నారు. సిల్వర్ ఓక్ మొక్కలవల్ల కలిగే దీర్ఘకాలిక ఆర్థిక ప్రయోజనాలను, అవి భూసారాన్ని ఎలా పెంపొందిస్తాయో ఈ సందర్భంగా రైతులకు వివరించారు. ఈ మొక్కలు కేవలం ఆదాయ వనరులే కాకుండా, పర్యావరణ సమతుల్యతను కాపాడటంలోనూ, స్వచ్ఛమైన గాలిని అందించడంలో కీలకమని వారు స్పష్టం చేశారు. ఇవి రైతుల పొలంలో పచ్చని బంగారు గనుల వంటివని పేర్కొన్నారు. పీఎన్‌పీ ఆగ్రో ఫారెస్ట్రీ సంస్థ పర్యావరణ పరిరక్షణ పట్ల, రైతుల ఆర్థికాభివృద్ధి పట్ల తమ నిబద్ధతను మరోసారి చాటుకుందని, సంస్థ చూపిన ఈ అసాధారణ ఉదారత పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఇది మాకు ఊహించని వరమని, ఈ మొక్కలు మా భవిష్యత్తుకు భరోసా ఇస్తాయని రైతులన్నారు. పీఎన్‌పీ ఆగ్రో ఫారెస్ట్రీ వంటి సంస్థలు చేస్తున్న ఈ కృషి నిజంగా ప్రశంసనీయమని, ఇది కేవలం మొక్కల పంపిణీ కాదని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊపిరిపోస్తూ, పచ్చని, సుసంపన్నమైన సమాజాన్ని నిర్మించే దిశగా వేసిన విప్లవాత్మక అడుగన్నారు. మరిన్ని సంస్థలకు ఇలాంటి స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేష్, ఆదినారాయణ, జగన్నాథం, రైతులు పాల్గొన్నారు.